స్టాన్‌ఫర్డ్‌లో సీటు... కోటి స్కాలర్‌షిప్పు!

ప్రతిష్ఠాత్మకమైన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో సీటు దొరకడం అంటే మాటలు కాదు.. అందులోనూ స్కాలర్‌షిప్‌తో కూడిన ప్రవేశం పొందాలంటే ఎంతో కష్టపడితే కానీ సాధ్యం కాదు. అటువంటి అరుదైన ఘనతను సాధించాడు విశాఖ నగరానికి చెందిన ఒబ్బిలిశెట్టి శ్రీరామ్ వరుణ్.

గూగుల్, ఫేస్‌బుక్ వంటి అత్యున్నత స్థాయి సంస్థలు అంకురాల దశలో ఇదే అమెరికన్ వర్సిటీలో రూపుదిద్దుకున్నాయి. తానూ అక్కడే ఎంబీఏ చదివి, తిరిగి భారత్‌కు వచ్చి నలుగురికీ ఉపయోగపడేలా ఒక సంస్థను నిర్మించాలనే కలతో ఈ ప్రయాణాన్ని ఆరంభించాడు వరుణ్.

మన దేశం మొత్తం మీద అక్కడ సీటు సాధించే విద్యార్థులు వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ఉంటారు. మరి ఇది ఎలా సాధ్యమైందో తన మాటల్లోనే...

తెలుగు కుర్రాడి సత్తా

"అమ్మానాన్నలు ఇద్దరూ వైద్యులే. కానీ నన్ను వైద్యవృత్తిలోకి వెళ్లాలని ఎటువంటి ఒత్తిడీ చేయలేదు. నచ్చింది చేయమని ప్రోత్సహించారు. చిన్నప్పటి నుంచి సొంతంగా కంపెనీ పెట్టాలనే ఆశ. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 178, మెయిన్స్‌లో 167 ర్యాంకు సాధించడంతో ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ సీటు దొరికింది. మూడో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దక్షిణ కొరియాలోని శామ్‌సంగ్ కంపెనీకి వెళ్లాను. వారికి నా పనితీరు నచ్చడంతో ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్ ఇచ్చారు. అందులో చేరి, అదే సమయంలో నా సొంత స్టార్టప్ ఆలోచనను కూడా పట్టాలెక్కించాలి అనుకున్నా. కొంత మంది స్నేహితులం కలిసి 2021లో ఆర్థిక సేవలు అందించే ఒక ఫిన్‌టెక్ యాప్‌ను అభివృద్ధి చేశాం. మన దేశంలో తక్కువ ఆదాయ వనరులు కలిగిన దిగువ మధ్యతరగతి ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దాం. కానీ మార్కెట్‌లోకి తీసుకెళ్లడం కొంచెం కష్టమైంది. మేమంతా టెక్నికల్ నేపథ్యం నుంచి వచ్చిన వాళ్లం కావడంతో మా బిజినెస్‌ను ఎలా మార్కెట్ చేసుకోవాలో తెలియక కాస్త ఇబ్బంది పడ్డాం. అదే సమయంలో కొవిడ్ విజృంభించింది. నిధులకు ఇంకా కష్టం అయిపోవడంతో అప్పటికి ఆ ఆలోచనను తాత్కాలికంగా విరమించుకున్నా.

అయితే ఉద్యోగంలో చేరానని నా లక్ష్యానికి దూరం కాలేదు. కంపెనీ పెట్టాలనే తపన అలాగే ఉంది. ఆ సంస్థలో మూడేళ్లు పనిచేసిన అనుభవం ఉంది, కానీ మార్కెటింగ్‌లో అనుభవం కోసం.. అలాగే ఆంత్రప్రెన్యూర్‌షిప్, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్.. ఇలా వ్యాపారానికి సంబంధించిన సమస్త విషయాల గురించి తెలుసుకునేందుకు ఎంబీఏ చేయాలని నిర్ణయించుకున్నా. అప్పటి నుంచి నా ప్రయత్నం మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్నతస్థాయి విద్యాసంస్థల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టాను. నా ఆలోచనకు రూపం ఇవ్వగలిగేలా నన్ను తీర్చిదిద్దే సంస్థ గురించి అన్వేషించాను. టాప్ 5 వర్సిటీలను ఎంచుకుని, ఒక్కోదానికి ఒక్కొక్క ఫైల్ తయారు చేసుకున్నాను. ఎందులో ఎటువంటి సౌకర్యాలు ఉన్నాయి, అధ్యాపకులు ఎవరు, ఏమేం నేర్పిస్తారు, ఇలా అన్నీ తెలుసుకున్నాను. అప్పటికే అక్కడ చదివి బయటకు వెళ్లిన పూర్వ విద్యార్థులను సామాజిక మాధ్యమాల ద్వారా కలిసి నా సందేహాలు నివృత్తి చేసుకున్నాను. స్నేహితుల ద్వారా కూడా సమాచారం సేకరించాను. కేవలం వీటిలో సీటు దొరికితే చదువుదాం అనుకుని దరఖాస్తులు పంపించడం మొదలుపెట్టాను.

ఉన్నత విద్యాసంస్థలకు దరఖాస్తులు చేయడం అంత సులభమైన పనికాదు. వీటికి ప్రపంచవ్యాప్తంగా మెరిట్ ఉన్న విద్యార్థులు వేలల్లో పోటీ పడుతుంటారు. 2022లోనే జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలు రాసేశాను. జీఆర్ఈలో 334, టోఫెల్‌లో 118 మార్కులు వచ్చాయి. మంచి స్కోర్లు రావడంతో నచ్చిన వర్సిటీలో సీటు దొరుకుతుందని ఊహించాను. అనంతరం దరఖాస్తులతోపాటు పంపాల్సిన వ్యాసాలు రాయడం సాధన చేశాను. మన గురించి చెబుతూ, కెరియర్‌కు సంబంధించి మన ఆలోచనలు పంచుకునేలా రాయాల్సిన ఈ వ్యాసాలు ప్రవేశం దొరికేదీ లేనిదీ నిర్ణయించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. అందుకే అలా సాధన కోసం రాసిన వాటిని సీనియర్లకు పంపి వారి అభిప్రాయాలు తీసుకునేవాడిని. నా ఇంటర్వ్యూ కూడా సుదీర్ఘంగా సాగింది. ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీ సీఈవో గంటపాటు 20, 30 ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ మంచి జవాబులిచ్చాను. ఆ ముఖాముఖి తర్వాత సీటు, స్కాలర్‌షిప్ ప్రకటించారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే రాత్రుళ్లు, వారాంతాల్లో ఈ పనులు చేస్తూ చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి దాదాపు ఏడాది పట్టింది. ఆ కష్టానికి తగిన ట్టుగానే కోరుకున్న కాలేజీలో సీటుతోపాటు రెండేళ్లకూ రూ.కోటి ఉపకార వేతనం లభించింది. ఫస్ట్‌ఇయర్ చూపిన ప్రతిభ ఆధారంగా రెండో ఏడాది మరిన్ని సౌకర్యాలు ఉంటాయి.

బహుముఖంగా..

ఇటువంటి ఫారిన్ వర్సిటీల్లో సీటు సాధించాలంటే మన ప్రొఫైల్‌ను వీలైనంత వైవిధ్యంతో ఉండేలా చూసుకోవాలి. మొదటి నుంచి మార్కులు, ర్యాంకులు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌పై దృష్టి పెట్టాలి. లక్ష్యం ఏమిటి, దాన్ని చేరుకోవడానికి ఎటువంటి మార్గం అనుసరిస్తున్నాం అనే దానిపై స్పష్టత ఉండాలి. నేను ఉద్యోగంలో ఉన్నప్పుడు స్థానిక బృందాలకు నాయకత్వం వహించాను. అది వర్సిటీ వారికి నాపై మరింత ఆసక్తి కలగడానికి కారణం కావొచ్చు. సంస్థను నెలకొల్పాలనే నా బలమైన లక్ష్యం వారికి అంతకంటే బలంగా చెప్పగలిగాను. దరఖాస్తు చేయదలచిన విద్యార్థులు ఈ విషయాలన్నీ గమనించాలి. అలాగే దీనిలో చదివేందుకు రూ.కోటి వరకూ ఖర్చవుతుంది. సాధారణ వర్సిటీలైతే కనీసం రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ ఉండాలి. ప్రతి వర్సిటీ వెబ్‌సైట్‌లో ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ ఉంటుంది, అక్కడ చదివి కొలువులు సాధించిన వారి వివరాలు అందులో చూసి అవకాశాలు ఎలా ఉన్నాయో తప్పకుండా అంచనా వేసుకోవాలి. నిజానికి ఇప్పుడున్న ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో ఏడాదికి రూ.కోటిపైగా చెల్లించే స్థిరమైన ఉద్యోగాన్ని వదిలేసి మళ్లీ చదువు కోసం వేరే దేశం వెళ్లడం అంటే చాలా పెద్ద నిర్ణయం. కానీ నా లక్ష్యం ఉద్యోగం, డబ్బు సంపాదన కాదు. భారతీయులకు ఉపయోగపడేలా ఏదైనా కనిపెట్టాలి, దాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలి, సొంతంగా సంస్థను నెలకొల్పి పలువురికి ఉద్యోగాలివ్వాలి, అందుకే ఉన్న ఉద్యోగాన్ని వదిలేయడానికి సిద్ధమయ్యా.

● యూనివర్సిటీలకు దరఖాస్తు ప్రక్రియ క్లిష్టమైనది. ముందే అన్నీ తెలుసుకుని దిగాలి. ఏదో ఒక సాధారణ సంస్థ నుంచి పట్టా పుచ్చుకున్నా అనుకున్న ఫలితాలు రాకపోవచ్చు. అలాగే కనిపించిన ప్రతి విద్యాసంస్థకూ దరఖాస్తు చేయడం వల్ల సమయం, డబ్బు వృథా. ఇవన్నీ ఆలోచించే అడుగులు వేయాలి. ఏది ఏమైనా కష్టపడి ప్రయత్నిస్తే మనం అనుకున్న విధంగా ప్రయాణించవచ్చు. తరచిచూస్తే మనలోనూ ఒక ఎలన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ ఉంటారు! కావాల్సిందల్లా పట్టుదలా, ప్రయత్నం మాత్రమే!!

డిగ్రీతోపాటు ఏ కోర్సు మేలు?

ఇంటర్ (సీఈసీ) పూర్తిచేశాను. స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌తో డిగ్రీ చదవాలనుంది. దీంతోపాటు దూరవిద్యలో ఏ కోర్సు చదివితే మంచిది? - లావణ్య

■ సాధారణంగా స్టాటిస్టిక్స్ కోర్సును డిగ్రీలో మ్యాథమెటిక్స్‌తో కలిపి చదివే అవకాశం ఉంది. బీఎస్సీలో మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ కానీ, మ్యాథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ కాంబినేషన్‌లో కానీ చదవొచ్చు. బీఏలో మ్యాథ్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ కాంబినేషన్ ఉంది. మీరు ఇంటర్‌లో మ్యాథ్స్ చదవలేదు కాబట్టి, ప్రస్తుత పరిస్థితుల్లో పైన చెప్పిన కాంబినేషన్లతో డిగ్రీ చేసే వీలు లేదు. జాతీయ విద్యావిధానం - 2020 పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చాక ఇలాంటి ఇబ్బందులు లేకుండా, ఎవరైనా ఏ కోర్సులైనా చదివే వెసులుబాటు

ఉంటుంది. కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలు ఇప్పటికే నూతన విద్యావిధానాన్ని అమలు చేయడం మొదలుపెట్టాయి. కాబట్టి, ఇంటర్‌లో మ్యాథ్స్ లేకుండా, డిగ్రీలో స్టాటిస్టిక్స్ కాంబినేషన్ ఉన్న డిగ్రీ ప్రోగ్రాంలో చేరే ప్రయత్నం చేయండి. డిగ్రీ మొదటి సంవత్సరంలో మ్యాథ్స్ ఫౌండేషన్ కోర్సులు చేయాల్సిన అవసరం ఉంటుంది.

మీకు స్టాటిస్టిక్స్ చదవాలన్న కోరిక బలంగా ఉంటే, ఇంటర్ రెండు సంవత్సరాల మ్యాథ్స్ సబ్జెక్టులను ఇప్పుడు పూర్తి చేసి, డిగ్రీలో స్టాటిస్టిక్స్ కోర్సును మ్యాథ్స్ కాంబినేషన్‌లో చదవండి. అలా వీలు కాకపోతే బీకాంలోనే స్టాటిస్టిక్స్‌ను ఒక సబ్జెక్టుగా చదివే ప్రయత్నం చేయండి. మీకు కంప్యూటర్ రంగంపై ఆసక్తి ఉందనుకోండి- బీకాం కంప్యూటర్స్ కోర్సు చదివితే, కంప్యూటర్స్‌తో పాటు స్టాటిస్టిక్స్ కోర్సును ఒక సబ్జెక్టుగా చదవొచ్చు. స్టాటిస్టిక్స్ అప్లికేషన్స్‌పై ఆసక్తి ఉంటే, బీకాం/ బీబీఏలో బిజినెస్ అనలిటిక్స్/ డేటా సైన్స్ చదివే వీలుంటుంది. స్టాటిస్టిక్స్, డేటా సైన్స్, అనలిటిక్స్ కోర్సుల్లో రాణించాలంటే- మ్యాథ్స్‌పై గట్టి పట్టు ఉండాలి. మీరు డిగ్రీ చదువుతూనే స్వయం, ఎన్‌పీటెల్, కోర్స్ ఎరా, ఎడెక్స్, యుడెమి లాంటి ఆన్‌లైన్ వేదికల్లో స్టాటిస్టిక్స్ కోర్సులు చేయవచ్చు.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ప్లాస్టిక్ టెక్నాలజీపై పట్టు పెంచుకుంటారా?

దైనందిన జీవితంలో మనం ఉపయోగిస్తున్న దాదాపు అన్ని వస్తువుల్లోనూ ఎంతో కొంత ప్లాస్టిక్ తప్పనిసరి. తేలిక, మన్నిక, సౌకర్యవంతం, తక్కువ ధరలో రూపొందడం.. మొదలైనవి ప్లాస్టిక్ ఆదరణకు కారణాలు. కేంద్రం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ప్లాస్టిక్ వస్తువులు తయారీ విభాగంలో ముఖ్య సంస్థ. ఇది హైదరాబాద్, విజయవాడ సహా దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు అందిస్తోంది. వాటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది.

కోరుకున్న రూపంలోకి సులువుగా మారిపోవడం ప్లాస్టిక్ ప్రత్యేకత. ఎన్నో విధాల ప్రయోజనకరంగా ఉండటంతో పరిశ్రమలు పెద్ద మొత్తంలో దీన్ని వినియోగిస్తున్నాయి. అలాగే ఉత్పత్తి చేస్తున్నాయి. ఇందుకోసం ప్లాస్టిక్ టెక్నాలజీపై పట్టున్నవారిని ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. ప్లాస్టిక్, అనుబంధ విభాగాల్లో మేటి మానవ వనరులను పరిశ్రమలకు అందించే లక్ష్యంతో కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చెన్నైలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ఏర్పాటైంది. గతంలో దీన్ని 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ'గా పిలిచేవారు.

ఈ సంస్థకు అనుబంధంగా దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. పరీక్షలో ప్రతిభతో వీటిలో ప్రవేశం లభిస్తుంది. వీటిని పూర్తిచేసుకున్నవారు ప్రాంగణ నియామకాల్లో మేటి సంస్థల్లో ఉద్యోగాలు సొంతం చేసుకుంటున్నారు. ఓఎన్‌జీసీ, ఓల్టాస్, మిల్టన్, సెలో, ఎల్‌అండ్‌టీ, మారుతీ సుజుకీ, రిలయన్స్, ఐఎఫ్‌బీ, బీపీఎల్, హెచ్‌సీఎల్, ఏషియన్ పెయింట్స్, బటర్‌ఫ్లై, టాటా...తదితర సంస్థలు వీరిని ఎంపిక చేసుకుంటున్నాయి. ఆటోమోటివ్, ప్యాకేజింగ్, కన్జూమర్ గూడ్స్, మెషిన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆర్ అండ్ డీ.. తదితర విభాగాలకు చెందిన సంస్థలకు ప్లాస్టిక్‌పై పట్టున్నవారి సేవలు కీలకం. అందువల్ల ఈ కోర్సులు చదివినవారి ఉపాధికి ఢోకా లేదు. కొన్నేళ్ల అనుభవంతో మెరుగైన వేతనాలూ అందుకోవచ్చు. సొంతంగానూ పరిశ్రమను నెలకొల్పవచ్చు.

డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను దేశవ్యాప్తంగా 30 సిపెట్ కేంద్రాల్లో అందిస్తున్నారు. ఇవి.. హైదరాబాద్, విజయవాడ, అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డీ, బాలాసోర్, భోపాల్, భువనేశ్వర్, చంద్రపూర్, చెన్నై, దేహ్రాదూన్, గువాహటి, హాజీపూర్, హల్దియా,

వివిధ డిప్లొమా కోర్సులు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31.
పరీక్ష ఫీజు: రూ.100.
ప్రవేశ పరీక్ష తేదీ: జూన్ 9
వెబ్‌సైట్: https://www.cipet.gov.in/

ఇంఫాల్, జయపూర్, కోచి, లఖ్‌నవూ, మధురై, ముర్థల్, మైసూరు, రాయ్‌పూర్, రాంచీ, కోర్బ, అగర్తల, గ్వాలియర్, వారణాసి, భగల్‌పుర్, అయోధ్యల్లో ఉన్నాయి.

ఏ కోర్సులకు ఏ అర్హతలు?

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)

వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)

అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. పరీక్షలు రాసి, ఫలితాలకోసం ఎదురుచూస్తున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 25, సైన్స్ 20, ఇంగ్లిష్ 5 ప్రశ్నలు వస్తాయి.

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ)

వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)

అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. పరీక్షలు రాసి, ఫలితాలకోసం ఎదురుచూస్తున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 25, సైన్స్ 20, ఇంగ్లిష్ 5 ప్రశ్నలు వస్తాయి.

పోస్టు డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ)

వ్యవధి: 18 నెలలు (3 సెమిస్టర్లు)

అర్హత: మెకానికల్/ ప్లాస్టిక్ టెక్నాలజీ/ టూల్/ ప్రొడక్షన్/ ఆటోమొబైల్/ మెకట్రానిక్స్/ టూల్ డై అండ్ మేకింగ్/ సిపెట్ నుంచి డీపీఎంటీ/ డీపీటీ వీటిలో ఎందులోనైనా మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత. చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే.

పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 20, సైన్స్ 10, ఇంగ్లిష్ 10, సంబంధిత డిప్లొమా నుంచి 10 ప్రశ్నలు వస్తాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ)

వ్యవధి: రెండేళ్లు (4 సెమిస్టర్లు)

అర్హత: ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది కోర్సులు చదువుతున్న వారూ అర్హులే.

పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 20, సైన్స్ 10, ఇంగ్లిష్ 10, బీఎస్సీ స్థాయి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మ్యాథ్స్ 10 ప్రశ్నలు వస్తాయి.

పై కోర్సులన్నీ హైదరాబాద్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. పీడీ-పీఎండీ తప్ప మిగిలినవి విజయవాడ క్యాంపస్‌లో ఉన్నాయి. అన్ని కోర్సులకూ ఏ వయసు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రవేశ పరీక్ష

అన్ని కోర్సులకూ ప్రవేశపరీక్షను ఆన్‌లైన్‌లో విడిగా నిర్వహిస్తారు. దీని వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. మొత్తం యాభై ప్రశ్నలు వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు. మాదిరి ప్రశ్నపత్రాలు సిపెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు వస్తాయి. మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో సైన్స్, ఇంగ్లిష్ ప్రశ్నలు పదో తరగతి సిలబస్ స్థాయిలోనే ఉంటాయి. అందువల్ల పాఠ్యపుస్తకాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు. సిపెట్ వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు పరిశీలించి, ప్రశ్నాంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

అలిమ్‌కో కేంద్రాల్లో వివిధ పోస్టులు

కాన్పూర్‌లోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా... కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా అలిమ్‌కో కేంద్రాల్లో 142 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ సీనియర్ కన్సల్టెంట్: 01 ★ మేనేజర్: 01 ★ డిప్యూటీ మేనేజర్: 01
★ అసిస్టెంట్ మేనేజర్: 04 ★ జూనియర్ మేనేజర్: 17
★ ఆడియాలజిస్ట్: 50 ★ ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్: 47 ★ స్పెషల్ ఎడ్యుకేటర్: 05 ★ క్లినికల్ సైకాలజిస్ట్: 05 ★ ఆప్టోమెట్రిస్ట్: 05
★ సీఎస్ఆర్ కన్సల్టెంట్: 01 ★ క్యూసీ అసిస్టెంట్: 04
★ ఫైనాన్స్ అసిస్టెంట్: 01

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సీఏతోపాటు పని అనుభవం.

వయసు: ఆడియాలజిస్ట్, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు; క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, క్యూసీ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు, సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16-04-2024.

వెబ్‌సైట్: https://alimco.in/content/7_1_Careers

నైపర్‌లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది

గువాహటిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్... ఓపెన్ కాంపిటిషన్ ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన 78 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

టీచింగ్ పోస్టులు

★ ప్రొఫెసర్ (మెడికల్ కెమిస్ట్రీ): 14
★ ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ): 14
★ అసిస్టెంట్ ప్రొఫెసర్ (బయోఫార్మాస్యూటికల్స్): 12
★ అసిస్టెంట్ ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ): 12
★ అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫార్మసీ ప్రాక్టీస్): 12

నాన్ టీచింగ్ పోస్టులు

★ సైంటిస్ట్/ టెక్నికల్ సూపర్‌వైజర్ గ్రేడ్-I: 09
★ అసిస్టెంట్ గ్రేడ్-II (అడ్మినిస్ట్రేషన్): 05

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వయసు: అసిస్టెంట్ గ్రేడ్-II పోస్టులకు 35 ఏళ్లు; ప్రొఫెసర్/ సైంటిస్ట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు.

జీతం: అసిస్టెంట్ గ్రేడ్-II పోస్టులకు నెలకు రూ.29,000; సైంటిస్ట్ పోస్టులకు రూ.53,000; ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,44,200; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.78,000.

ఎంపిక: రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: టీచింగ్ పోస్టులకు రూ.1000; నాన్ టీచింగ్ పోస్టులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17-04-2024.

దరఖాస్తు హార్డ్ కాపీల స్వీకరణకు చివరి తేదీ: 27-04-2024.

వెబ్‌సైట్: https://niperguwahati.ac.in/recruitment.html

నిట్ దుర్గాపూర్‌లో టీచింగ్ ఫ్యాకల్టీ

పశ్చిమ్ బెంగాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దుర్గాపూర్... వివిధ విభాగాల్లో 43 ఫ్యాకల్టీ సభ్యుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-II/ గ్రేడ్-I: 37
★ అసోసియేట్ ప్రొఫెసర్: 05 ★ ప్రొఫెసర్: 01

విభాగాలు: బయోటెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వయసు: 60 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష, ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-04-2024

దరఖాస్తు హార్డ్‌కాపీల స్వీకరణకు చివరి తేదీ: 10-05-2024.

వెబ్‌సైట్: https://nitdgp.ac.in/p/careers

వాక్-ఇన్

కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, హ్యాండీమ్యాన్

న్యూదిల్లీలోని ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... దేహ్రాదూన్, చండీగఢ్ విమానాశ్రయాల్లో వాక్-ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా 74 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ డ్యూటీ మేనేజర్: 02 ★ జూనియర్ ఆఫీసర్- టెక్నికల్: 01
★ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 17 ★ జూనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 17 ★ ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 08
★ యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: 06
★ హ్యాండీమ్యాన్: 15 ★ హ్యాండీ ఉమన్: 08

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని అనుభవం.

వయసు: డ్యూటీ మేనేజర్ పోస్టులకు 55 ఏళ్లు, ఇతర ఖాళీలకు 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ట్రేడ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 16, 17, 18, 19.

వేదిక: శ్రీ గణపతి గార్డెన్, డూన్ పబ్లిక్ స్కూల్ రోడ్, భనియావాలా (దేహ్రాదూన్).

వెబ్‌సైట్: https://www.aiasl.in/Recruitment

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

ఎస్ఆర్ ఎడ్యు టెక్‌లో

1. వాయిస్ ఓవర్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, వాయిస్-ఓవర్ ఆర్టిస్ట్, వాయిస్‌ఓవర్
స్టైపెండ్: నెలకు రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 15
☛ internshala.com/i/fba2c8

2. వీడియో ఎడిటర్

నైపుణ్యాలు: వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: నెలకు రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
☛ internshala.com/i/f6711a

ఆపరేషన్స్

సంస్థ: పంజాబీ బర్గర్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, సోషల్ మీడియా మార్కెటింగ్,
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 18
☛ internshala.com/i/a68cbf

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

సంస్థ: ఎంఐటీటీ ఏఆర్‌వీ టెక్నాల